క్లుప్తంగా

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

సారంగపూర్: విద్యార్థులు పోలీసుల విధులు, చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విద్యార్థులకు చట్టాలు, డయల్ 100, షీటీమ్ సేవలపై అవగాహన కల్పించారు. అంతకుముందు కేక్ కట్ చేసి విద్యార్థులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఆపదలో ఆందోళన చెందకుండా 100కు డయల్ చేయాలని సూచించారు. అనంతరం వైర్‌లెస్‌సెట్, ఎఫ్‌ఐఆర్ నమోదు, సైబర్‌నేరాలు, కోర్టు కేసులను వివరించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ రమణారావు, పలువురు పోలీసు సిబ్బంది, తదితరులు ఉన్నారు.

పర్యవేక్షణ లేకనే పనుల్లో నాణ్యత లోపం


మాట్లాడుతున్న రామయ్య

ఖానాపూర్: సదర్మాట్ కాలువ మరమ్మతుల్లో నాణ్యత లోపానికి అధికారుల పర్యవేక్షణ లోపమే కారణమని ఏఐకేఎంఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి నందిరామయ్య అన్నారు. సోమవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఖానాపూర్, కడెం మండలాల రైతుల వరప్రదాయిని అయిన సదర్మాట్ పనుల్లో నిర్లక్ష్యానికి ప్రభుత్వ వైఫల్యమే కారణమన్నారు. స్థానిక ఎమ్మెల్యే స్పందించి సదర్మాట్, సరస్వతి కాలువ శాశ్వత లైనింగ్ పనుల కోసం రూ.20కోట్లు కేటాయించాలన్నారు. లేకుంటే రైతుల పక్షాన ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో అంకుష్‌రావు, రాజన్న, గోరెబాయి, వర్మ, మున్వర్ ఉన్నారు.

పాఠశాలలు తనిఖీ చేసిన ఎంఈవో

కడెం: మండలంలోని ధర్మాజీపేట్, పెద్దూర్ ప్రభుత్వ పాఠశాలలను ఇన్‌చార్జ్ ఎంఈవో మధుసూదన్ తనిఖీ చేశారు. సమయపాలన పాటిస్తూ మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం, తొలిమెట్టు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు.
దస్తురాబాద్: మండలంలోని బుట్టపూర్, మున్యాల పాఠశాలలను సోమవారం ఎంఈవో మధుసూదనచారి తనిఖీ చేశారు. ఈసందర్భంగా హాజరుశాతం, మధ్యాహ్న భోజనం పరిశీలించి విద్యార్థులతో పాఠాలు చదివించారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భూమిపూజ చేసిన ఎంపీపీ

సారంగపూర్: మన ఊరు–మన బడిలో భాగంగా మండలంలోని జామ్ గ్రామంలో రూ.69.78లక్షలతో నిర్మించే ప్రాథమిక పాఠశాల భవన నిర్మాణానికి సోమవారం ఎంపీపీ మహిపాల్‌రెడ్డి భూమిపూజ చేశారు. ఈసందర్భంగా ఎంపీపీని వీడీసీ సభ్యులు సత్కరించారు. కాంట్రాక్టర్ పనులను నాణ్యతతో సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో అడెల్లి ఆలయ కమిటీ అధ్యక్షుడు ఆయిటి చందు, ఇన్‌చార్జి సర్పంచ్ విలాస్, సర్పంచ్‌లు మురళీకృష్ణ, రవీంద్రనాథ్ రెడ్డి, సారంగాపూర్ ఉపసర్పంచ్ ముత్యం, నాయకులు పీఆర్ ఏఈ శరత్, కార్యదర్శి అశోక్, తదితరులు పాల్గొన్నారు.

శానిటరీ ఇన్‌స్పెక్టర్ సస్పెన్షన్

నిర్మల్‌టౌన్: హరితహారాన్ని నిర్లక్ష్యం చేసినందుకు నిర్మల్ మున్సిపాలిటీ ఇన్‌చార్జ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురారిని కలెక్టర్ ముషరఫ్ అలీ సోమవారం సస్పెండ్ చేశారు. ఈమేరకు మున్సిపల్ కమిషనర్‌కు ఉత్తర్వులు జారీ చేశారు. దీనిని కమిషనర్ ధ్రువీకరించలేదు.

సదరం సర్టిఫికెట్ ఇవ్వాలి

నిర్మల్‌చైన్‌గేట్: ప్రభుత్వం 2016 చట్టం ప్రకారం అనుమతి ఇచ్చిన 21 రకాల వ్యాధులకు సదరం సర్టిఫికెట్ ఇవ్వాలని తెలంగాణ దివ్యాంగుల పునరావాస అభివృద్ధి సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు సట్టి సాయన్న కోరారు. జిల్లా కేంద్రంలో సోమవారం మాట్లాడారు. 1995 చట్టం ప్రకారం ఏడు వ్యాధులకు మాత్రమే ప్రస్తుతం బుకింగ్ జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి క్రాంతికుమార్, ఇసాక్‌అలీ, మారాజు గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.




ఖానాపూర్‌లో దర్శనం చేసుకుంటున్న భక్తులు

ఆలయాలకు 'ముక్కోటి' శోభ

- స్వామివారికి ప్రత్యేక పూజలు
- ఉత్తరద్వార దర్శనం చేసుకున్న భక్తులు

ముక్కోటి ఏకాదశి సందర్భంగా సోమవారం ఆలయాలు కిటకిటలాడాయి. పవిత్ర పర్వదినం కావడంతో తెల్లవారుజాము నుంచే భక్తులు క్యూకట్టారు. ఉత్తరద్వార దర్శనం ద్వారా స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బంది కల్గకుండా ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చే శారు. పూజలు, అభిషేకాలు చేయడంతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి.


లోకేశ్వరం: భాగాపూర్‌లో భక్తుల పూజలు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని గాంధీచౌక్ భగవాన్ శ్రీ మురళీకృష్ణ ఆలయంలో భక్తులు ఉదయం అష్టోత్తర శతనామార్చన, ఉత్సవమూర్తి ఊరేగింపు, ఉత్తరద్వార దర్శనము, లక్ష తులసీదళాలతో సహస్ర నామార్చన, వెన్నతో ఉత్సవమూర్తి తులాభారం, విష్ణు సహస్రనామ పారాయణం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదం అందించారు.
దస్తురాబాద్: మండల కేంద్రంలోని వేంకటేశ్వర, లక్ష్మీనరసింహ ఆలయాల్లో అర్చకులు కొండమాచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు.
ఖానాపూర్: పట్టణంలోని శ్రీలక్ష్మి వేంకటేశ్వర ఆలయానికి భక్తులు తరలివచ్చి ఉత్తరద్వార దర్శనం ద్వారా స్వామివారిని దర్శించుకున్నారు. అర్చకులు చక్రపాణి నర్సింహమూర్తి, నిమ్మగడ్డ సందీప్‌శర్మ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.
కుంటాల : మండలంలోని కల్లూర్ సాయిబాబా, కుంటాల శ్రీకృష్ణుడి ఆలయం ఉమామహేశ్వర ఆలయాల్లో వేడుకలు నిర్వహించారు. అర్చకులు శ్రీకాంత్, వినయ్‌పాండే, ఆలయ కమిటీ సభ్యులు కృష్ణరావు పాల్గొన్నారు.
లక్ష్మణచాంద: మండలకేంద్రంతోపాటు, చామన్‌పెల్లి, చింతల్‌చాంద, మునిపెల్లి, వడ్యాల్, కనకాపూర్, పార్‌పెల్లి, పీచర గ్రామాల్లోని ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేడుకల్లో జెడ్పీటీసీ రాజేశ్వర్, బీఆర్ఎస్ జిల్లా కార్యదర్శి రమేష్, లక్ష్మణచాంద సర్పంచ్ ముత్యంరెడ్డి, ఎంపీటీసీ నర్సారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


లక్ష్మణచాంద పల్లకీసేవలో గ్రామస్తులు


దస్తురాబాద్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో..

లోకేశ్వరం: మండలంలోని భాగాపూర్ రాజ్యలక్ష్మీ సహిత లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో పూజలు చేశారు. స్వామివారికి పంచోపనిషత్తులతో అభిషేకం, పూజ, సహస్ర తులసీదళ అర్చన, అష్టోత్తర పూజలు చేశారు.
మామడ: మండలంలోని పొన్కల్ శ్రీలక్ష్మివేంకటేశ్వరాలయంలో అర్చకులు విజయ్‌స్వామి, రామచంద్రచార్యులు పూజలు నిర్వహించారు. ధనుర్మాసంలో ఉత్తరద్వార దర్శనం విశిష్టతను భక్తులకు వివరించారు. భక్తులు మంగళహారతులతో ఆలయానికి వచ్చి ఉత్తర ద్వారం నుంచి స్వామివారిని దర్శనం చేసుకున్నారు.
భైంసాటౌన్: పట్టణంలోని శ్రీ మహాలక్ష్మి జువెల్లరీ మార్కెట్ ప్రాంతంలో శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తుల కోసం స్వామివారి ఉత్తరద్వార దర్శనం ఏర్పాటు చేశారు. అర్చకులు కల్యాణ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు.
నిర్మల్‌రూరల్: మండలంలోని చిట్యాల వేంకటేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. నిర్మల్, మంజులాపూర్, తల్వేద, నర్సాపూర్, దిలావర్‌పూర్ నుంచి భక్తులు తరలివచ్చారు.


మామడ: పొన్కల్ వేంకటేశ్వరాలయంలో..


నిర్మల్ మురళీకృష్ణ ఆలయంలో..


కుంటాల శ్రీకృష్ణుడి ఆలయంలో..

అటెన్షన్ ప్లీజ్..

అధ్వానంగా గోదావరి ఘాట్లు



బాసర: బాసర గోదావరి తీరంలో స్నానాల ఘాట్ల వద్ద అపరిశుభ్రత నెలకొనడంతో రోగాల బారిన పడుతున్నామని పలువురు భక్తులు వాపోతున్నారు. అధికారులు స్పందించి తీరం వద్ద పరిసరాలు శుభ్రం చేయించాలని వారు కోరుతున్నారు.
ప్రశ్నించాల్సిన అధికారి: విజయరామారావు, ఆలయ ఈవో, ఫోన్: 9491000656

రైతు బజార్‌లో..

కూరగాయలు	కిలో(రూ.లో)
టమాటా	10
వంకాయ	40
బెండకాయ	40
పచ్చిమిర్చి	40
కాకరకాయ	50
బీరకాయ	60
క్యారెట్	80
గోరుచిక్కుడు	60
కొత్తిమీర	100
అల్లం	50
ఎల్లిగడ్డ	50
ఉల్లిగడ్డ	25
ఆలుగడ్డ	30

\- నిర్మల్‌టౌన్

సినిమాలు



తిరుమల : ధమాకా
నారాయణ : అవతార్
వెంకటేష్ : టాప్ గేర్

కొండగట్టుకు తరలిన భక్తులు

మామడ: మండలంలోని పొన్కల్ గ్రామంలో 85 మంది హనుమాన్ స్వాములు సోమవారం దీక్ష విరమణకు జగిత్యాల జిల్లాలోని కొండగట్టు అంజన్న ఆలయానికి తరలివెళ్లారు. 41 రోజులపాటు దీక్షలో ఉన్న భక్తులు స్థానిక హనుమాన్ నాగదేవతాలయంలో ప్రత్యేక పూజలు, అన్నదానం చేశారు.

దరఖాస్తుల స్వీకరణ

నిర్మల్‌చైన్‌గేట్: డబుల్ బెడ్ రూం ఇళ్ల కోసం పట్టణంలోని రెండోవార్డు పరిధిలోని నాయుడుపేటలో కౌన్సిలర్ సాదం అరవింద్ పలువురి నుంచి దరఖాస్తులు స్వీకరించారు. మంగళవారం కూడా దరఖాస్తుల స్వీకరణ ఉంటుందని.. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ అధికారులు తెలిపారు.

పీహెచ్‌సీ వైద్యాధికారిగా సుభాష్



సారంగపూర్: మండల కేంద్రంలోని పీహెచ్‌సీ వైద్యాధికారిగా సోమవారం జె.సుభాష్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వైద్యాధికారికి పీహెచ్‌సీ సిబ్బంది కృష్ణమోహన్‌గౌడ్, రాజేందర్, ప్రణ్‌కుమార్ స్వాగతం పలికారు.

నర్సరీ పరిశీలన

నిర్మల్‌టౌన్: పట్టణంలో భాగ్యనగర్ ప్రాంతంలోని నర్సరీ పార్కును సోమవారం మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ పరిశీలించారు. పెరిగిన మొక్కలు, చెత్త తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు.

గ్రామాల అభివృద్ధికి సీఎం కృషి

- ఎమ్మెల్యే రేఖానాయక్

దస్తురాబాద్: గ్రామాల అభివృద్ధికి సీఎం కేసీఆర్ నిరంతరం కృషి చేస్తున్నారని ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ అన్నారు. సోమవారం మండలంలోని పేర్కపల్లే, మున్యాలతండా గ్రామాల్లో పంచాయతీ భవనాల నిర్మాణాలకు భూమిపూజ చేశారు. ఎంపీపీ కిషన్, వైస్ ఎంపీపీ రాజునాయక్, సర్పంచ్‌లు అప్పని ప్రభాకర్, సురేష్‌నాయక్, బీఆర్ఎస్ మండల అధ్యక్ష,కార్యదర్శులు ఐలయ్యయాదవ్, రాజనర్సయ్య, శ్రీనివాస్, రాజు, రాజలింగం పాల్గొన్నారు.
ఖానాపూర్: మండలంలోని బాదనకుర్తి గ్రామంలో రూ.8లక్షలతో నిర్మించే మున్నూరుకాపు సంఘ భవనం నిర్మాణ పనులను ఎమ్మెల్యే రేఖానాయక్ ప్రారంభించారు. త్వరలో సంఘానికి మరో రూ.రెండు లక్షలు ఇస్తామన్నారు. అంతకముందు ఎమ్మెల్యే నివాసంలో పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. పార్శపు శ్రీనివాస్, అంకం రాజేందర్, పుప్పాల శంకర్, గౌరై గంగాధర్, మోహిద్, వెంకాగౌడ్, రామునాయక్, లచ్చన్న, తదితరులు ఉన్నారు.


పేర్కపల్లెలో భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే

బీజేపీతోనే సుస్థిర అభివృద్ధి

భైంసా: బీజేపీతోనే సుస్థిర అభివృద్ధి సాధ్యమని నియోజకవర్గ నాయకులు పవార్ రామారావ్‌పటేల్ అన్నారు. సోమవారం ఎస్ఎస్ కాటన్‌లో లోకేశ్వరం మండలం బాగాపూర్ గ్రామ ఇన్‌చార్జి సర్పంచ్ గంగాధర్, పలువురు వార్డుసభ్యులు రామారావ్‌పటేల్ సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ మేరకు వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అన్ని వర్గాల అభివృద్ధి కోసమే బీజేపీలో చేరినట్లు గంగాధర్ తెలిపారు. వారి వెంట లోకేశ్వరం ఎంపీటీసీ జయ్‌సాగర్‌రావు, గోపాల్, అబ్దుల్‌రజాక్, ఫిరోజ్ ఖాన్ తదితరులు ఉన్నారు.


బీజేపీలో చేరిన వారితో రామారావ్‌పటేల్

దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

కుంటాల : హిందూ దేవతలు, అయ్యప్ప స్వామిపై బైరి నరేశ్‌ను ప్రోత్సహిస్తూ మండలంలోని వెంకూర్ గ్రామానికి చెందిన దిగంబర్ ఫేస్‌బుక్‌లో మద్దతు తెలుపగా.. అయ్యప్ప స్వాములు, బీజేపీ, హిందు వాహిని కార్యకర్తలు ఆయనపై దాడి చేసి బహిరంగ క్షమాపణ చెప్పించారు. నరేష్‌కు మద్దతివ్వడం తప్పేనని క్షమాపణ చెప్పినా తనపై భౌతిక దాడి చేశారని.. వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం దళిత సంఘాల ఆధ్వర్యంలో దిగంబర్, వారి కుటుంబసభ్యులు కుంటాల పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్సై తారాచంద్‌కు ఫిర్యాదు చేశారు. దాడి చేసిన వారిపై అట్రాసిటి కేసు నమోదు చేయాలని ఫిర్యాదులో కోరారు. కార్యక్రమంలో దళిత సంఘాల నేతలు తదితరులు పాల్గొన్నారు.


ఫిర్యాదు చేస్తున్న, దిగంబర్, కుటుంబసభ్యులు

సంక్షిప్త వార్తలు

ఆర్టీసీ బస్సు ప్రారంభం
మామడ: మండలంలోని పోతారం గ్రామానికి సోమవారం ఆర్టీసీ బస్సును డిపో మేనేజర్ సాయన్న ప్రారంభించారు. ముత్యంరెడ్డి, పోతారం, అనంతపేట్ సర్పంచ్‌లు లక్ష్మీనారాయణ, సుమలత, పాల్గొన్నారు.

జనజాగరణ ప్రారంభం
కుభీర్: మండల కేంద్రంలో తెలంగాణ విమోచన వజ్రోత్సవ సమితి అధ్వర్యంలో జనజాగరణ కార్యక్రమం సోమవారం ప్రారంభించారు. ఇంటింటికి తిరుగుతూ నిజాం కాలంలో జరిగిన అన్యాయాలను వివరించారు. వజ్రోత్సవ సమితి విభాగ్ ప్రముఖ్ దామోదర్, పోశెట్టి, కుల్దీప్ ఉన్నారు.

ఇద్దరికి గాయాలు
భైంసారూరల్: ఇలేగాం–ఉమ్రి (కే) గ్రామాల మధ్య సోమవారం బైక్ అదుపుతప్పి కింద పడిన ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఇలేగాం గ్రామానికి చెందిన భోజన్న దత్తాత్రి బైక్‌పై తానూరు మండలం ఉమ్రి(కే) నుంచి ఇలేగాం గ్రామానికి వస్తున్నారు. ఈ క్రమంలో బైక్ అదుపు తప్పడంతో వారు కిందపడ్డారు. స్థానికులు గమనించి భైంసా ఏరియా ఆస్పత్రికి తరలించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ
లోకేశ్వరం: తహసీల్దార్ కార్యాలయంలో తపస్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను తహసీల్దార్ సరిత ఆవిష్కరించారు. నాయబ్ తహసీల్దార్ అశోక్, తపస్ రాజేశ్వర్, నరేంద్రకుమార్ పాల్గొన్నారు.

గురుస్వాములకు సన్మానం

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని హరిహర క్షేత్ర ఆలయ గురుస్వామిగా పి.ఎస్ మూర్తి నియమితులై నాలుగేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆలయ ధర్మకర్తలు అల్లోల వినోదమ్మ–మురళీధర్‌రెడ్డి సోమవారం సన్మానించారు. ధర్మకర్తలు మాట్లాడుతూ.. నిస్వార్థంగా గురుస్వామి మూర్తి స్వామివారికి నిర్విరామంగా సేవలు అందిస్తున్నారన్నారు. మూర్తి గురుస్వామి మాట్లాడుతూ.. తన ఆధ్వర్యంలో ఆలయం రజతోత్సవం జరగడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం రజతోత్సవాల్లో సేవలందించిన గురుస్వామి పాకాల రాంచందర్‌ను ఆలయ ధర్మకర్తలు సన్మానించారు. పురుషోత్తం, పూజారులు సదాశివశర్మ, సంతోష్‌శర్మ, శుక్ల పూజారి, స్వాములు యువరాజ్, నాంపల్లి సంతోష్‌వర్మ, రామకృష్ణ, విశాల్, రాము, స్వాములు పాల్గొన్నారు.


గురుస్వాములను సన్మానిస్తున్న ధర్మకర్తలు

కాంగ్రెస్ నాయకుల అరెస్టు

భైంసారూరల్: స్థానిక సంస్థల నిధులను రాష్ట్రప్రభుత్వం దారి మళ్లించడాన్ని నిరసిస్తూ సోమవారం కాంగ్రెస్ పార్టీ హైదరాబాద్‌లో ధర్నాకు పిలుపునిచ్చింది. ఈ మేరకు ధర్నాకు వెళ్తున్న కాంగ్రెస్ ఓబీసీ సెల్ అధ్యక్షుడు ఆనంద్‌రావుపాటిల్, పలువురిని అరెస్టు చేసి గ్రామీణపోలీస్‌స్టేషన్‌కు తరలించారు.
కడెం: టీపీసీసీ ఆధ్వర్యంలో ఇందిరాపార్క్ వద్ద తలపెట్టిన ధర్నాకు స్థానిక కాంగ్రెస్ నాయకులు వెళ్లకుండా ముందస్తుగా అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్టయిన వారిలో వాజీద్‌ఖాన్, షేక్ రఫీక్, బబ్లూ, రహీం, రాజన్న, బ్రహ్మచారి ఉన్నారు.
కుంటాల : టీపీసీసీ ఆధ్వర్యంలో తలపెట్టిన ధర్నాకు వెళ్లకుండా కాంగ్రెస్ యువజన విభాగం మండల కన్వీనర్ ఆలూర్ ప్రశాంత్, ఎండీ యూనూష్, ఎస్‌కే ఇలియాస్‌ను అరెస్టు చేసినట్లు ఏఎస్సై రాందాస్ తెలిపారు.


నిర్మల్ పోలీస్‌స్టేషన్‌లో కాంగ్రెస్ నాయకులు

నిర్మల్‌రూరల్: సర్పంచ్‌ల సమస్యలపై నిరసన చేపట్టకుండా కాంగ్రెస్ నాయకులను ముందస్తుగా అరెస్టు చేశారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు జమాల్, పీసీసీ సభ్యులు సాదా సుదర్శన్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నరేందర్, వెంగాపేట్ సర్పంచ్ గంగయ్యను సోమవారం అరెస్టు చేసి రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

లక్ష్మణచాంద: అర్హులైన జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు, అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలని కోరుతూ టీయూడబ్ల్యూజే నాయకులు సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నాయబ్ తహసీల్దార్ గంగాధర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో గంగాధర్, రాజేంద్రప్రసాద్, వెంకటేశ్వర్, శేఖర్, ఈశ్వర్ పాల్గొన్నారు.
కుంటాల : జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ టీయూడబ్ల్యూజే(ఐజేయూ) ఆధ్వర్యంలో తహసీల్దార్ కలీంకు వినతి పత్రం అందజేశారు. మండల కన్వీనర్ బి.రవికుమార్, సంఘ సభ్యులు రాజేందర్‌రెడ్డి, రాజు, దినేష్ పాల్గొన్నారు.
ముథోల్: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ముథోల్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం టీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో జర్నలిస్టులు వినతి పత్రం అందజేశారు.
కుభీర్: తమ సమస్యలు పరిష్కరించాలని తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ పద్మకు మండలంలోని జర్నలిస్టులు వినతిపత్రం అందజేశారు. ప్రసాద్, రాందాస్, శేఖర్, మైనొద్దీన్, గఫూర్, రవి ఉన్నారు.
లోకేశ్వరం: తమ సమస్యలు పరిష్కరించాలని టీయూడబ్ల్యూజే నాయకులు తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సరితకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నవీన్, పులి రమేశ్, భోజారాం, సతీశ్ పాల్గొన్నారు.
పెంబి: తమ సమస్యలు పరిష్కరించాలని మండలంలోని జర్నలిస్టులు తహసీల్దార్ శ్రీధర్‌కు వినతిపత్రం ఇచ్చారు. నరేష్, సృజన్, ప్రమోద్, మురళి, రాజు తదితరులు ఉన్నారు.


11:30 గంటలకు ఖాళీగానే కలెక్టర్, అదనపు కలెక్టర్ల కుర్చీలు


అమ్మ అర్జీ కోసం వెళ్లడంతో బయట చిన్నారులు


అధికారుల కోసం ఎదురుచూస్తున్న మహిళలు


ఆవరణలో వృద్ధులు

సమయానికి రారు.. సమస్యలు తీర్చరు

జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణికి అధికారులు సకాలంలో రాకపోవడంతో అర్జీదారులు పడిగాపులు కాయాల్సి వచ్చింది. ఉదయం 10:30 గంటలకు మొదలవాల్సిన ప్రజావాణి అధికారుల ఆలస్యంతో 11:45 గంటలకు ప్రారంభించారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్